తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

ధాన్యం తరలించాలని రైతుల ధర్నా

దామెర: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని నిర్వాహకులు తరలించడం లేదంటూ రైతులు ధర్నాకు దిగారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం, సింగరాజుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఐకేపీ ఆధ్వర్యంలో సింగరాజుపల్లిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు లేవంటూ నిర్వాహకులు చేతులెత్తేయడం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రోజుల తరబడి నిలువ ఉండడంతో రైతులు కన్నెర్ర జేస్తూ రోడ్డెక్కారు. ఈక్రమంలో దామెర – పరకాల ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దాంతో సుమారు గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా ఇప్పటికే పంటకు నష్టం వాటిల్లిందని, చేతికొచ్చిన కొద్దిపాటి ధాన్యం సైతం మరోసారి అకాల వర్షాలకు తడిసి మొలకెత్తే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పదించి లారీలు సమకూర్చి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు.



సింగరాజులపల్లిలో రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

ధాన్యం బస్తాలను మిల్లుకు తరలించాలి

శాయంపేట: పెద్దకోడెపాక ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో భారీగా పేరుకుపోయాయని ధాన్యం బస్తాలను వెంటనే మిల్లుకు తరలించాలని సర్పంచ్ అబ్బు ప్రకాశ్ రెడ్డి సూచించారు. పెద్దకోడెపాక గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సివిల్ సప్లై అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు భారీగా పేరుకుపోయాయని తెలిపారు. ఈక్రమంలో రెండు, మూడు రోజుల్లో మిల్లుకు తరలించి రైతులను ఆదుకోవాలని అధికారులను కోరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న రైతు దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈక్రమంలో గ్రామంలోని రైతు వేదికను ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ రాజు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాజు, డీటీ సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ రాకేష్ ఉన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సర్పంచ్

కొత్తకొండ వీరభద్రస్వామికి మొక్కులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ స్వామివారిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీకి ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏసీపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ మారిశెట్టి శ్రీధర్, ప్రధాన అర్చకులు కంచనపల్లి రాజయ్య, సదానందం, రాంబాబు, శ్రీకాంత్, రమేష్, శ్రవణ్‌కుమార్, కార్యనిర్వాహణ అధికారి కిషన్‌రావు, తదితరులు ఉన్నారు.



వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆత్మకూరు: మండలంలోని కటాక్షపూర్ గ్రామానికి చెందిన ఉద్యమకారులు ఎస్‌కే.సర్దార్, హుస్సేన్, నాగయ్యపల్లి గ్రామానికి చెందిన పోగుల ప్రభాకర్ ఇటీవల మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు, ఉద్యమకారులు ఎండీ.బాబా, సయ్యద్ హుస్సేన్, భిక్షపతి, లింగమూర్తి, షేక్ హుస్సేన్, వడ్డేపల్లి రాజేంద్రబాబు, శ్రీనివాస్‌రెడ్డి, సృజన్, రామకృష్ణ, షరీఫ్, వినయ్, విక్రమ్, కరీం, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

జిల్లా కేంద్రం సాధనతోనే పరకాల అభివృద్ధి



మద్దతు తెలుపుతున్న ఎలక్ట్రీషియన్స్, పెయింటర్స్ అసోసియేషన్ నాయకులు

పరకాల: జిల్లా కేంద్రం సాధనతోనే పరకాల అభివృద్ధి సాధ్యమవుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పరకాల అమరవీరుల జిల్లా సాధన కోసం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన చేస్తున్న పోరాటానికి పరకాల పట్టణంలోని ఎలక్ట్రీషియన్స్, పెయింటర్స్ అసోసియేషన్లు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పరకాల జిల్లా కేంద్రం కోసం జరుగుతున్న పోరాటానికి ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు పలుకుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో జరుగబోయే జిల్లా పోరాటాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. పరకాలకు తీరని అన్యాయం చేసిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సాధన కమిటీ జిల్లా కన్వీనర్ దుబాసి వెంకటస్వామి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, ఎలక్ట్రీషియన్ అధ్యక్షుడు ఆకునూరి రమేష్, ప్రధాన కార్యదర్శి సూర రఘు, పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకునూరి గోపాల్, ప్రధాన కార్యదర్శి వక్కెల కుమార్, రెండు సంఘాల నాయకులు, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌కు చెందిన ముస్కె సుధాకర్ (38) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు పదేళ్ల క్రితం సుధాకర్ భార్య రేణుక మృతి చెందగా అప్పటి నుంచి సుధాకర్ మద్యానికి బానిసయ్యాడు. తన భార్య చనిపోయిందని తీవ్ర మనోవేదనకు గురవుతున్న సుధాకర్.. ఇదే విషయాన్ని తరచూ తన సోదరుడి కుటుంబ సభ్యులకు చెప్తూ బాధపడేవాడు. ఈ క్రమంలోనే గత నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యానికి యత్నించాడు. ఈక్రమంలో సుధాకర్‌ను అతని ఇద్దరు కుమారులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సుధాకర్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సోదా అనిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుమలత

పరకాల: తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు 21రోజుల పాటు ప్రణాళికాబద్ధంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత సూచించారు. పరకాల మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 2నుంచి 22వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఆత్మకూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలంలో దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆత్మకూరు ఎంపీపీ మార్క సుమలత కోరారు. ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మండల స్థాయి సమన్వయ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. జూన్ 2నుంచి 22వరకు జరగనున్న అన్ని శాఖల దినోత్సవాలను పండుగలా జరుపుకోవాలని చెప్పారు. జెడ్పీటీసీ రాధిక మాట్లాడుతూ నివేదికలను తయారు చేసి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతు దినోత్సవం ఏర్పాట్లు గురించి తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు యాదగిరి, మనోహర్, రబియాజీ హుసేన్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీఓ చేతన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, సూపర్‌వైజర్ పద్మావతి, పీహెచ్‌సీ డాక్టర్ స్పందన, ఐబీ ఏఈ నిశాంత్, ఏపీఓ రాజిరెడ్డి, ఏఈఓలు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలు

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో స్వయంభూగా వెలిసిన లక్ష్మీనృసింహ ఆలయంలో గురువారం స్వాతి నక్షత్ర పూజలు నిర్వహించారు. స్తంభాకృతిలోని స్వయంభూ లక్ష్మీనృసింహ స్వామి మూలమూర్తికి, గర్భాలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మి, నరసింహ స్వామి ధ్రువమూర్తులకు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అర్చకులు రవి, వంశీ, జయకృష్ణ, వెంకటరత్నం పంచసూక్త పఠనం చేస్తూ విశేషంగా అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష్మి, నరసింహ స్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి, మండల రైతుబంధు కన్వీనర్ మునిగాల సంపత్ – సరిత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెండోట మధుసూదనాచారి కుటుంబ సభ్యులు కల్యాణంపై కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ మాట్లాడుతూ ఇకనుంచి ప్రతినెల స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో అభిషేకం, కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కంజర్ల రమేష్, ఎంపీటీసీ తాటికాయల రమేష్, ఉప సర్పంచ్ బొల్లం ప్రకాష్, కమిటీ సభ్యులు నిమ్మాని వెంకటేశ్వర్‌రావు, అరూరి వకుళ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఎంపీపీ మధుమతి, భక్తులు

ఊర చెరువు శిఖాన్ని కాపాడండి

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని 774 సర్వే నంబర్‌లోని ఊర చెరువు శిఖం భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని, హద్దులు నిర్ణయించి ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ గుజ్జుల రవిందర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శనిగరం వెంకటేష్, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ గొర్రె ఎర్రయ్య, మహిళా సంక్షేమ మండల కన్వీనర్ ఆరెపల్లి స్వరూప, కామెర లక్ష్మణ్, రేణుకుంట్ల సాంబయ్య, అంబాల సంతోష్, రేణికుంట్ల పుష్ప, సాంబలక్ష్మి, మానస, వసంత, అనసూర్య, సౌందర్య, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

పరకాల: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, ఈక్రమంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పర్యటించి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, కళాశాల ఉద్యోగులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు